

# సినీ'మాయ'నమః

కథా నిలయం
శ్రీకాకుళం

"ఎక్స్‌లెంట్ సార్ ! చాలా బావుంది !"

"హబ్బో ! ఫైట్స్ అదిరాయి !"

"హీరోయిన్ చాలా బాగా చేసిందండీ !"

"క్లైమాక్స్ వెరైటీగా ఉంది !"

"పాటలు సూపర్బ్ !"

"హండ్రెడ్ డేస్ గ్యారంటీ !".... కొత్తగా రిలీజైన సినిమాని గురించిన వెరైటీ యాడ్ టీవీలో.

చెవులు, కళ్లూ మనసుకు అనుసంధానం చేసి, మైమరచి ఆసక్తిగా గమనిస్తున్నారు. మురళి, విజయ, ఉత్తేజ్. మురళి ఓ లిమిటెడ్ కంపెనీలో అకౌంటెంట్, విజయ హౌస్ వైఫ్. ఉత్తేజ్ వాళ్ల ముద్దుల సంతానం ఓ కాన్వెంట్‌లో ఎనిమిదో తరగతి చదువుతున్నాడు.

యాడైపోగానే సడెన్‌గా ఈలోకంలోకి వచ్చాడు మురళి.

"ఏరా ! హోం వర్కు చేస్తున్నావా ? లేక చూసిందే చూడబుద్దైతుందండీ!" అన్న లెవల్లో టీవీలో లీనమైపోయావా ?" పళ్లు నూరుతూ రిమోట్‌తో ఛానెల్ మార్చేశాడు మురళి.

సమాధానం చెప్పకుండా పుస్తకాలు తీసుకుని 'ఛీ ! ఈ బతుక్కి ఫ్రీడమ్ లేదు. ఒక్క బిడ్డనన్న మాటేగానీ, ఒక్కరోజూ ఆప్యాయంగా పలకరించడే కసాయి తండ్రి' మనసులో తిట్టుకుంటూనే తన బెడ్రూంలో కెళ్లిపోయాడు ఉత్తేజ్.

"ఎందుకు వాణ్ణలా ఏడిపిస్తారు ? ఏదో అరగంట టీవీ చూసినంత మాత్రాన..." కన్నబిడ్డ కళవళపడటాన్ని జీర్ణించుకోలేకపోయింది తల్లిపేగు.

"ఏయ్...! నువ్వు నోర్మూయ్ !" అధికార దుర్వినియోగానికి అద్దంలా కనిపిస్తున్న అర్ధాంగి 'అర్ధ'జ్ఞానం మురళి కోపాగ్నికి అజ్యం పోసింది.

"నీవల్లే వాడిలా తయారయ్యింది. వేలకు వేలు పోసి చదివిస్తున్నా వెధవని. ఏనాడైనా మంచి మార్కులు తెచ్చుకున్నాడా ? ఎప్పుడూ అత్తెసరు మార్కులే. నీ లాంటి తల్లులుంటే వాడింతకంటే ప్రయోజకుడెలా అవుతాడు ?" ఆ రోజు ఆఫీసులో మానేజర్ పీకిన క్లాసు మనసులో ఇంకా ఆరిపోలేదు.

స్వాభిమానం కన్నీటి రూపు సంతరించుకోటానికెంతోసేపు పట్టలేదు. విజయకి.

"అనండి ! నన్నే అనండి ! ఎక్కడెక్కడి కోపాలన్ని తీర్చుకునేందుకు నేనే ఉన్నానుగా.... తేరగా ! అయినా మీ చదువేపాటిదో నాకు తెలీదా, వాడికి తెలీదా ! ఉమ్మెత్త చెట్టుకు మల్లెపూలెలా పూస్తాయి ?" ఇంటర్లో మురళి నాలుగుసార్లు తప్పిన సంగతి దెప్పిపొడుస్తూ, పనిలో పనిగా ముక్కు చీదేస్తూ వంటింటివైపు వడివడిగా సాగింది.

"ఛ !" కసిగా తనను తానే తిట్టుకుంటూ మళ్ళీ ఛానెల్ మార్చాడు మురళి.

'పాడిందే పాడరా, పాసుపండ్ల దాసరీ...' అన్నట్టు అయిదు నిముషాలు తిరక్కుండానే మళ్లీ అదే అడ్వర్టైజ్‌మెంట్.

'ఛ ! టీవీలు విజృంభించి సినిమాల ప్రాధాన్యత తగ్గించాయంటున్నారు గానీ, సినిమాని తోసిరాజనే టీవీ లేవి ? 'ఏ టీవీ ఛానెలు చూసిన ఏమున్నది గర్వకారణం. టీవీ ఛానెళ్లు సమస్తం సినిమా పీడన పరాయణత్వం' అన్న చందాన జిగురు పాకాల సీరియళ్లు, మళ్లీ మళ్లీ రిపీటయ్యే వార్తలు తప్ప, మిగతా కార్యక్రమాలన్నీ ఏదో ఒక రకంగా సినిమా రంగు రుద్దుకున్నవే గదా !

"ఎక్సలెంట్ సార్....."

ఉలిక్కిపడ్డాడు మురళి. మరోమారు అదే యాడ్. 'భ్రమర కీటక న్యాయం' లాగా అనుకోకుండా అటు డైవర్టైపోయాడు.

'నిజంగానే సినిమా బావున్నట్టుంది. ఓసారి చూస్తే పోలా' అనుకున్నాడు.

❋ ❋ ❋

"వదినా ! సినిమాకెళ్దామా !" మధ్యాహ్నం భోజనంలోకి ఆలూ కుర్మా తయారు చేసుకుంటున్న విజయ దగ్గరికి హడావుడిగా వచ్చింది పక్కవాటా ప్రసన్న.

"ఏమోనబ్బా ! నిన్న సాయంత్రమే సినిమా విషయంలో మా ఆయన అంతెత్తున ఎగిరాడు..." కుర్మా కంటె ముందే విజయ మొహం మాడిపోయింది.

"ఏం ! రాత్రి మాట్లాడుకోలేదా ?" మధ్యతరగతి భార్యభర్తల ఫిర్యాదులను పరిష్కరించే 'న్యాయస్థానం' రాత్రి సంగతి గుర్తు చేస్తూ, సినిమాల్లో డబుల్ మీనింగ్ డైలాగుకొడ్తున్న లెవల్లో అడిగింది ప్రసన్న.

"అబ్బో ! అంత 'సీన్' లేదులే" వత్తి పలికింది విజయ.

"ఆ ! అన్నయ్య సంగతి నాకు చెప్పమాకొదినా .... ఎంత పెద్ద మీసాలున్నా ఆయన గుమ్మడికాయే, నువ్వు కత్తిపీటవే" మరోశ్లేష - ప్రసన్న.

'ఇక్కడ నేను ఉన్నా'నంటూ తన ఘాటుతో గుర్తుచేసిన కుర్మాని హడవుడిగా కలియబెడ్తూ ఆలోచనలో పడిపోయింది విజయ.

"అబ్బ ! ఇంత చిన్న విషయానికి అంతలా ఆలోచిస్తావేం వదినా ! రెడీ అవ్వు" సమాధానం కోసం చూడకుండా తనవాటలో కెళ్లింది ప్రసన్న.

గోడ గడియారం వంక యధాలాపంగా చూసి 'అబ్బో ! అప్పుడే ఒంటిగంటై పోయిందా చక చకా తయారు కావడంలో నిమగ్నమైపోయింది - ప్రసన్న వెళ్లగానే.

❄ ❄ ❄

"అబ్బ ! ఈ సినిమా చూడకపోతే నేను చాలా మిస్సయ్యేదాన్నే, వదినా థియేటర్లోంచి బయటికొస్తు కృతజ్ఞతగా ప్రసన్నని చూసింది విజయ.

"నేనైతే ఎన్నిరోజుల నుండో అనుకుంటున్నాను. ఇప్పటికి తీరింది. హీరో కొత్త కుర్రాడే అయినా, బాగా చేశాడు కదూ !" వెలిగే కళ్లతో ప్రసన్న.

"హీరోయిన్ ఒక్క పాటలో ఎన్ని డ్రెస్సులు మార్చింది !" విజయ ఆశ్చర్యం.

"హీరో తల్లి కట్టిన కనకాంబరం రంగు చీర చాలా బావుంది కదూ !" ప్రసన్న.

మాట్లాడ్తూ థియేటర్ పక్కన బస్‌స్టాప్ కొచ్చేశారు తమకి తెలియకుండానే.

"మా డాడీకి తెలిస్తే చీరేస్తాదురా ! బస్సు దొరక్కపోతే పరుగెత్తైనా ఇల్లు చేరుకోవాలి.

'ఎక్కడో విన్న గొంతుకలా ఉందే !' అనుకుంటూ అటు చూసిన విజయ అదిరిపడింది.

కుమారరత్నం ఉత్తేజ్. యూనిఫాం, వీపున బ్యాగు, పక్కన ఫ్రెండ్స్. 'వాడు చదివేది నల్గొండ క్రాస్ రోడ్స్‌లోని స్కూల్లో. కనిపిస్తున్నది ఆర్.టి.సి. క్రాస్ రోడ్స్ బస్టాప్‌లో. అంటే.....వాడూ ఇదే సినిమా చూసి....' విజయ గుండె కలుక్కుమంది. మరుక్షణంకన్నబిడ్డను కాపాడుకోవాలనే కర్తవ్యం గుర్తొచ్చింది.

"తేజా !" పిలిచింది. కొడుకుని ముద్దుగా.

తల్లి పిలుపుతో ఉలిక్కిపడ్డాడు ఉత్తేజ్. పారిపోయేందుకు దారి లేదు. తలవంచుకుని బుద్ధిమంతుడిలా తల్లి ముందుకొచ్చాడు. పరిస్థితిని చదివేసిన వాని స్నేహితులిద్దరూ చల్లగా జారుకున్నారు.

"సారీ మమ్మీ ! ఫ్రెండ్స్ ఫోర్స్ చేస్తే...మూవీ చాలా బాగుందని...." అబద్ధం చెప్పి అవస్థ పడటం కంటె, నిజం చెప్పడమే శ్రేయోదాయకమన్న లౌక్యాన్నెరిగి చక్కని అభినయంతో గిల్టీనెస్ ప్రదర్శించాడు.

'బస్టాండ్ నిండా జనం. ఆటోలేవి ఆగటం లేదు. కొడుకుతో సహా తను త్వరగా ఇంటికి చేరుకోవాలి...ఎలా ?' ఆలోచిస్తుండగానే ఆపద్బాంధవునిలా సెవెన్ సీటర్ ఆటోలో నుంచి ఓ శాల్తీ కొంగలా తల బైటికి పెట్టి అరుస్తున్నాడు. "వైఎమ్‌సిఏ, కాచిగూడా, కోఠి, దిల్‌సుక్‌నగర్ !" అంటూ కూరగాయ లమ్ముకుంటున్నట్టు అరిచాడు. అదెప్పుడొచ్చి ఆగిందో ! గమనించనే లేదు విజయ.

మరో ఆలోచన లేకుండా కొడుకు చెయ్యి పట్టుకొని అందులో కెక్కింది.

"విజయా..... మీ....." ఏదో చెప్పబోతున్న ప్రసన్నని పట్టించుకోలేదు.

అంతలోనే ఆటో కదిలింది.

అపుడు చూసింది విజయ. ఎదుటి సీట్లో... మొహంలో ఏభావం తెలియకుండా అడ్డుపెట్టుకున్న గుబురు మీసాలతో శ్రీవారు మురళి. మధ్యాహ్నం ఆఫీసెగ్గొట్టి అదే సినిమా చూసి వస్తున్నాడన్న సంగతి భయంలో ఆమెకు తట్టకపోవడం మాత్రం యాదృచ్ఛికం.

**(5 అక్టోబరు 2002, ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక)**